క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థలోని ప్రజారోగ్యశాఖ సిబ్బంది గురువారం మధురానగర్, ఏలూరు కాలువ పరిసర ప్రాంతాలలో డ్రోన్‌తో ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేశారు. కల్వర్ట్ వద్ద ఫాగింగ్, బ్రహ్మయ్య వీధి వద్ద ఉన్న కాలువలో ట్రక్సర్‌తో గుర్రపుడెక్కను తొలగించారు. బుడమేరు కాలువలో మలేరియా సిబ్బంది బోట్ల సాయంతో శుభ్రం చేశారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తత అవసరం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): క్షయ వ్యాధి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కొత్తపేటలోని షేక్ రాజాసాహెబ్ మినీ జనరల్ ఆస్పత్రి టీబీ విభాగం హెల్త్ విజిటర్ లలితా కుమారి అన్నారు. టీబీ నియంత్రణ మాసోత్సవాల సందర్భంగా గురువారం వన్‌టౌన్‌లోని అన్నపూర్ణాదేవి వీఎంసీ హైస్కూల్, కేబీఎన్ కళాశాలల్లో అవగాహనా సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫిబ్రవరి 24 నుంచి మార్చి 24వ తేదీ వరకు క్షయ నియంత్రణ అవగాహన కార్యక్రమాలు నిరంతరం జరుగుతున్నాయన్నారు. టీబీ వ్యాధికి ఇటీవల విద్యార్థులు అధికంగా గురవుతున్నారని చెప్పారు. ఈ వ్యాధి పట్ల అవగాహనతో ఉండాలన్నారు. వ్యాధి సోకిన వారు నిర్ణయించిన విధంగా మందులు వాడితో అదుపులోకి వస్తుందని తెలిపారు. వ్యాధి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ ఫ్రాన్సిస్, జోసెఫ్ తంబి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): రోడ్డు ప్రమాదంలో గాయపడి గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న పొదిలి పద్మ(45) గురువారం మరణించినట్లు నున్న పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాయకాపురానికి చెందిన పొదిలి పద్మ ఈ నెల 4న కండ్రిక రోడ్డు నుంచి రాజీవ్‌నగర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. గీతాంజలి స్కూల్ వద్ద కుక్క అడ్డు వచ్చి పడిపోయింది. తలకు గాయమైన పద్మను గుంటూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. బుధవారం ఆపరేషన్ చేయగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు మృతురాలి కుమారుడు పవన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ. లక్ష విలువైన మూడు వెండి కిరీటాలు వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం రైల్వేకాలనీలోని శివకేశవ దేవాలయంలో గురువారం సినీ నటి సురేఖవాణి కుటుంబ సభ్యులతో కలిసి రూ. లక్ష విలువ చేసే మూడు వెండి కిరీటాలను ఆలయానికి అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన ఆలయంలోని సాయిబాబా, అయ్యప్పస్వామి, వేంకటేశ్వరస్వామికి వెండి కిరీటం తయారు చేయించి అందజేస్తున్నట్లు తెలిపారు.భక్తితో సేవిస్తే సకల కష్టాలు తీరుతాయన్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ శరణ్‌స్వామి ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించి వెండి కిరీటాలు అలంకరించారు అనంతరం 300 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయకమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు 'మహిళలు-చైతన్యం' సదస్సు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 11.30 గంటలకు రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో 'మహిళలు-చైతన్యం'పై సదస్సు నిర్వహించనున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో సిద్ధార్థ దుర్గామల్లేశ్వర మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ పాల్గొంటారని పేర్కొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): అజిత్‌సింగ్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 8వ తేదీ ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వావిలాల రజనీకాంత్ శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ నిర్వహించే శిబిరంలో ఆయాన్ ఐ ఆస్పత్రికి వైద్యులు ఉచితంగా నేత్ర పరీక్షలు చేస్తారని తెలిపారు. శుక్లాలు ఉన్నవారికి అవసరమైన మేరకు రాయితీపై శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాలతో జనం బెంబేలు

- గట్టు వెనుక ప్రాంతంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు
- గాయాలపాలవుతున్న ప్రజలు
- ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్



చర్చి సెంటర్‌లో మరమ్మతులు పూర్తయినా తొలగించని బారికేడ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'కుమ్మరిపాలెం సెంటర్‌కు చెందిన షేక్ మస్తాన్ ఇంటర్ చదువుతున్నాడు. భవానిపురం మసీదు వీధి నుంచి కుమ్మరిపాలెంలోని ఇంటికి బైక్‌పై వెళ్తుండగా స్వాతి సెంటర్ వద్ద అతివేగంగా వచ్చిన కారు వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఘటనలో మస్తాన్ గాయలపాలై ఆసుపత్రిలో చేరాడు. 'భవానిపురానికి చెందిన ఆర్ముగం గణేష్ బీటెక్ పూర్తి చేసి టీ స్టాల్ నిర్వహిస్తున్నాడు. బైక్‌పై ఇంటికి వెళుతుండగా స్వాతి థియేటర్ వద్ద వేగంగా వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని రెండు కాళ్లు విరిగాయి'.'లంబాడి పేట సాయిరామ్ థియేటర్ ప్రాంతానికి చెందిన దువ్వ గణేష్ బైక్‌పై సితారా సెంటర్ నుంచి గొల్లపూడి వైపు వెళుతుండగా ఆటోను ఢీకొట్టి పడిపోయాడు. తలకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదాలన్నీ కేవలం రెండు, మూడు రోజుల వ్యవధిలోనే చోటుచేసుకోవడం గమనార్హం. ఇలా పశ్చిమ నియోజకవర్గంలోని గట్టు వెనుక ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు నిత్య కృత్యమయ్యాయి. ప్రమాదాల్లో గాయపడి ఆసుపత్రుల్లో చేరుతున్న క్షతగాత్రుల సంఖ్య పెరుగుతోంది. కాళ్లు విరిగినవారు..తలకు బలమైన గాయాలై అవస్థలు పడుతున్నారు. భవానిపురం పోలీసుస్టేషన్‌కు ప్రతి నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదం జరిగిందని ఫిర్యాదులు అందుతున్నాయి. కొందరు ఫిర్యాదులు చేయకుండానే సర్దుబాటు చేసుకుని వెళ్లి ఆసుపత్రుల్లో చేరుతున్నారు. ముఖ్యంగా స్వాతి థియేటర్ జంక్షన్ వద్ద నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పోలీసులు ఇక్కడ ట్రాఫిక్ నియంత్రిస్తున్నప్పటికీ వాహనాలు అతివేగంగా వస్తుండటం, వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోతుండటంతో ప్రమాదాల సంఖ్య పెరిగిపోతోంది.

సితారా సెంటర్‌లో గందరగోళం...

సితారా సెంటర్ వద్ద రోడ్డు విశాలంగా ఉండటంతో పాటు పెద్ద కూడలి కావడంతో ఏ వాహనం ఎటువెళుతోందో కూడా తెలియని పరిస్థితి. ఇక్క స్వాతి సెంటర్‌లోనే ట్రాఫిక్ సిబ్బంది ఉంటున్నారు. చర్చి సెంటర్, కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, కబేళా సెంటర్ వద్ద పరిస్థితి దారుణంగా తయారైంది. కబేళా వద్ద ద్విచక్రవాహనదారులు లారీల మధ్యలో చిక్కుకుంటున్నారు. ఇసుక లారీలు ఏ లారీ ఎటువెళ్తుందో తెలియకపోవడం, లారీడ్రైవర్లు మలుపుల్లోనూ అతివేగంగా నడపుతుండటంతో తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చర్చి సెంటర్ వద్ద ఊర్మిళానగర్ వైపు నుంచి వచ్చే వాహనాలు ఎత్తు ఎక్కాల్సి వస్తుండటంతో వాహనాన్ని వేగంగా నడుపుతున్నారు. ఈక్రమంలో వేగంగా వచ్చే ఆయా వాహనాలు సితారా వైపు వెళుతున్నాయో లేక గొల్లపూడి వైపో.. లేక క్రాంబే రోడ్డుకు వెళతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంటోంది.

ప్రమాదాలకు కారణమవుతున్న బారికేడ్..

ఇటీవల ఈ సెంటర్‌లో పైపులైన్‌కు మరమ్మతుల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్‌ను 20రోజులుగా తీయలేదు. మరమ్మతు పనులు పూర్తయినప్పటికీ బారికేడ్ తీయకపోవడంతో కొందరు బారికేడ్‌కు ఎటువైపు వస్తున్నారో తెలియక ఢీకొడుతున్నారు. పైగా వ్యాపార కూడలి కావడంతో రద్దీ కూడా ఎక్కువగానే ఉంటోంది. ఈ సెంటర్‌లో కాలినడకన వెళ్లేవారు రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. ప్రమాదాల బారిన పడి ఆసుపత్రుల్లో చేరిన వారి నుంచి ఫిర్యాదులు తీసుకుని కేసులు నమోదు చేయడమే తప్ప ... ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వాహనాలు అతివేగంగా నడిపే వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకంపై కఠిన చర్యలు

కమిషనర్ ధ్యానచంద్ర



భవానీపురం(విజయవాడపశ్చిమ):నగరంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకంపై కఠినమైన చర్యలు తీసుకోవడంతోపాటు పూర్తిగా నిషేధించేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. కార్పొరేషన్‌లోని ఆయా విభాగాధిపతులు, స్పెషల్ ఆఫీసర్లు, ప్రజారోగ్య సిబ్బందితో గురువారం సాయంత్రం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్లు తమతమ డివిజన్ల పరిధిలో విస్తృతంగా పర్యటించి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ విక్రయించే వారితోపాటు కొనుగోలు చేసే వారిపై కూడా చట్టపరమైన శిక్షలు విధించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విభాగాధిపతులంతా పర్యవేక్షించి ప్లాస్టిక్ నిషేధంపై కఠినంగా వ్యవహరించాలన్నారు. అలాగే ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలకు, విక్రయదారులకు సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై విస్తృత ప్రచారం కల్పించినప్పటికీ, ఇంకా ప్లాస్టిక్ వినియోగం కనబడుతూనే ఉండటం సరికాదన్నారు. పర్యావరణ హితమైన వస్తువులనే వాడాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జీవన పోరాటం



జీవన పోరాటంలో భాగంగా కృష్ణానది దిగువున ఓ మత్స్యకారుడు గురువారం నడుము లోతు నీటిలో దిగి చేపలకు గాలం వేస్తున్నాడు. ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పారిశుద్ధ్యం నిర్వహణకు పటిష్ట చర్యలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరం పరిశుభ్రంగా ఉండేందుకు చేపడుతున్న పారిశుద్ధ్యం నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకోవడంతో పాటు ఎటువంటి లోపం ఉండకూడదని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు స్పష్టం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలోగల సమావేశ మందిరంలో గురువారం ఆయన లీడ్ వర్కర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోడర్ పాయింట్ల వద్ద లోడర్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్ అయిన ఆంధ్రప్రదేశ్ కానిస్టెంట్ మానిటరింగ్ ఆఫ్ మున్సిపల్ సర్వీసెస్(ఏపీ సీఎంఎంఎస్)లో ప్రతి రోజూ అప్‌డేట్ చేయాలని చెప్పారు. ఈ యాప్‌లో పారిశుద్ధ్య నిర్వహణ నిమిత్తం వచ్చే కార్మికుల హాజరు, ఇంటి వద్దనే



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌బాబు

వ్యర్థాల సేకరణ, ఒక్కో శానిటరీ సెక్రటరీకి ఎన్ని ఇళ్లు ఉన్నాయి, ఆయా ఇళ్ల నుంచి నిత్యం చెత్త సేకరణ జరుగుతుందా లేదా అన్న విషయాలను పొందుపరచాలని వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ బాబు శ్రీనివాస్, డాక్టర్ గోపీ నాయక్, శానిటరీ సూపర్‌వైజర్లు కె.శివరామ్ ప్రసాద్, ఆర్.ఓబేశ్వరరావు, సలీం అహ్మద్, డి.సోమరాజు, ఎం.రమేష్‌బాబు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీలో వేగంగా ఔషధ పరిశోధనలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): అభివృద్ధి చెందిన దేశాల్లో ఏఐ వంటి ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి నూతన ఔషధ పరిశోధనలు వేగవంతంగా పూర్తిచేస్తున్నట్లు అమెరికాలో క్యాన్సర్‌పై పరిశోధనలు చేస్తూ బిజినెస్ డెవలప్‌మెంట్ లీడర్‌గా సేవలందిస్తున్న డాక్టర్ సబ్బినేని హారిక అన్నారు. నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో గురువారం ఫార్మా అన్వేషణ్-2025 పేరుతో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి హారిక మాట్లాడుతూ నూతన టెక్నాలజీని పరిశోధనలో ఉపయోగించడం ద్వారా తక్కువ సమయంలో సమర్థంగా నిర్వహించవచ్చన్నారు. ఏఐ టెక్నాలజీపై అవగాహన కలిగిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత పరిశోధనల్లో ఏఐని ఉపయోగించి త్వరితగతిన పూర్తి చేస్తున్న క్రమాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.సునీత, డాక్టర్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేతలమంటూ బెదిరిస్తున్నారు!

వృద్ధ దంపతుల ఆవేదన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మా షాపుల్లో అద్దెకు ఉంటున్నవారు తాము జనసేన నేతలమంటూ బెదిరించి తమ భవనాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వృద్ధ దంపతులు మద్దుల దామోదరం, లక్ష్మి ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వారి నుంచి తమకు ప్రాణహాని ఉందన్నారు. తమను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రక్షించాలని వేడుకుంటున్నారు. మద్దుల దామోదరం గురువారం తారాపేటలో మీడియాతో మాట్లాడుతూ 70ఏళ్ల వృద్ధుడినైన తనపై షాపుల అద్దెదారులు మానుకొండ శ్రీనివాస్, మిరియాల హరీష్, అల్లాడ నరసింహారావు ఒక పథకం ప్రకారం తమపై అక్రమ కేసు పెట్టారని చెప్పారు.

తాము ఈ పాతబిల్డింగ్ స్థానంలో కొత్త నిర్మాణం చేపడతామని గతంలో అద్దెదారులకు చెప్పామన్నారు. వారు కోరినట్లుగా పలుదఫాలుగా రెండేళ్లు సమయం ఇచ్చామన్నారు. తాము షాపులు ఖాళీచేసి ఇస్తామని వారు తమకు రాసి ఇచ్చారని, అయితే దుర్బుద్ధితో వారు ఇప్పుడు వృద్ధులమైన మేము చనిపోతే ఆ స్థలాన్ని తమ సొంతం చేసుకునేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. అద్దెదారులు షాపులు ఖాళీ చేసేశామని చెప్పడంతో తాము జేసీబీతో ఆషాపులను తొలగించాలని చూసినపుడు ఆయా షాపుల్లో కొంత సామాన్లు ఉండటం చూసి వెంటనే షాపుల కూల్చివేతను ఆపివేశామన్నారు.



మాట్లాడుతున్న వృద్ధ దంపతులు

అయితే అప్పటికే పథకం ప్రకారం కుట్రతో వున్న అద్దెదారులు తమ షాపులను అక్రమంగా కూలగొట్టినట్లు వన్‌టౌన్ పోలీసుస్టేషన్లో కేసు పెట్టారని వివరించారు. షాపుల అద్దెదారులు చేస్తున్న కుట్రలపై తమ ఫిర్యాదును పోలీసులు తీసుకోవడం లేదని వాపోయారు. తమ ఏకైక కుమారుడు అమెరికాలో ఉంటున్నాడని, తాము ఈ ఆవేదనతో మరణిస్తే తమ స్థలాన్ని కబ్జా చేయాలని అద్దెదారులు శ్రీనివాస్, హరీష్, నరసింహారావు చూస్తున్నారని ఆరోపించారు. మానుకొండ శ్రీనివాస్ భార్య చాముండేశ్వరి తమను ఎంతో వేధిస్తున్నారని, జనసేన నాయకుల పేర్లు చెప్పి బెదిరిస్తున్నారన్నారు. గుంటూరు జనసేన పార్టీ ఆఫీసు నుంచి వీర మహిళలుగా వచ్చామని చెబుతూ తమను బెదిరిస్తున్నారని వాపోయారు. పోలీసులు, సీఎం, డిప్యూటీ సీఎం స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని వాసవీ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. శబరి పరియోజన సంస్థ, సమత జాగృతి ఆధ్వర్యంలో వించిపేటలో శబరిమాత జయంతి కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా హజరత్తయ్యగుప్తా మాట్లాడుతూ.. వ్యక్తి చేసే మంచి పనుల వలన, సాధించిన ఔన్నత్యం వల్ల ఆ జాతికి గుర్తింపు వస్తోందని శబరిమాత ఆధ్యాత్మిక శోభ రుజువు చేసిందన్నారు. సాక్షాత్తు శ్రీరామచంద్రుడు మాత అందించిన ఎంగిలి పండ్లను ఆరగించారని, ధర్మం, భక్తి భావాలు భగవంతుడికి ప్రీతికరమని శబరి జీవితం వెల్లడిస్తుందని చెప్పారు. అటువంటి మహనీయురాలు ఉద్భవించిన రెల్లి జాతీయులు గత చరిత్రను విస్మరించకుండా హైందవ సంస్కృతికి వన్నెలు చేకూర్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. భువనేశ్వరి పీఠాధిపతులు శ్రీ కమలానంద భారతీ స్వామి మాట్లాడుతూ.. రెల్లి జాతి



మాట్లాడుతున్న వేముల హజరత్తయ్యగుప్తా

పూర్వ చరిత్రను వివరించారు. ఆధ్యాత్మిక ఉపన్యాసకులు లోకనాథ్ శర్మ, రాష్ట్రీయ స్వయం సేవక్ పదాధికారి నవీన్, రెల్లి కుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వి.అప్పారావు, సమత జాగృతి పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మాడుగుల నాగశంకర్, నాయకులు ఎస్.నాగేశ్వరరావు, కొంపల్లి శ్రీనివాస్, డప్పు కళాకారులు శ్యాం కుమార్, దిలీప్, శరత్, సింహాచలం, కొవ్వూరి శివ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని గురువారం ఎం.బి.వి జ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, సేఫ్, తరుణి తరంగాలు, భారత మహిళామండలి, జనశిక్షణ సంస్థాన్, స్ఫూర్తి, సమన్విత సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు, అభ్యుదయ గీతాలు, కవితల పోటీలు జరిగాయి. ముఖ్య అతిథి ఆంజనేయులు పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాల ఉత్పత్తుల అమ్మకం ద్వారా పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు స్త్రీల ద్వారానే జరుగుతున్నాయన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఈ స్థాయిలో ఉండటంలో మహిళలదే కీలక పాత్ర అన్నారు. యూఎస్‌ఏ హెల్త్‌కేర్ ఎకనమిస్ట్ పాలపర్తి ఇంద్రాణి మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేస్తారని, యోగా, మెడిటేషన్



మాట్లాడుతున్న ఆంజనేయులు

లకు తప్పనిసరిగా సమయం కేటాయించాలన్నారు. ఎం.బి.విజ్ఞానకేంద్రం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కె.స్వరూపరాణి మాట్లాడుతూ లింగ సమానత్వం సాధించాలంటే ఐక్యరాజ్య సమితి ఇచ్చిన పిలుపును వేగవంతం చేయాలని, బాలికలు, మహిళలను విద్యా, ఆరోగ్య, ఉపాధి, ఉద్యోగాల్లో పరిపాలనాధికారాల్లో, క్రీడా రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎం.బి.వి జ్ఞాన కేంద్రం బాధ్యులు, పి.విజయ, పావని, గీత, నందిని, సేఫ్ బాధ్యులు ఉషారాజా, శేషు, తరుణీత రంగాలు బాధ్యులు శ్రీదేవి, జనశిక్షణ సంస్థాన్ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

'ఎలక్ట్రానిక్స్'తో యువతకు ఉపాధి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిత్యం జీవితంలో ఎలక్ట్రానిక్స్ పరికరాల వినియోగం భవిష్యత్‌లో మరింత ఎక్కువగా ఉంటుందని మైటిజన్ కంపెనీ డైరెక్టర్ పి.రవీంద్ర చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యాన ఎలక్ట్రానిక్స్ వెహికల్స్ అనే అంశంపై కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో జరుగుతున్న రెండు రోజుల వర్క్‌షాప్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, ఏసీ, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వాహనాలు ఇలా ఎన్నో ఎలక్ట్రానిక్ పరికరాలను మనం నిత్య జీవితంలో విరివిగా ఉపయోగిస్తున్నామని చెప్పారు. ఇంట్లో వాడే ఎలక్ట్రానిక్స్ గృహోపకరణాలను సులభంగా మరిన్ని ఎక్కువ ఫీచర్స్‌తో తయారు చేసి కంపెనీలు మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయని చెప్పారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మరింత మెరుగైన ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు. ఎలక్ట్రానిక్స్ వాహనాల



రవీంద్రను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు

పనితీరుతో పాటుగా వాటిలో ప్రధానమైన బ్యాటరీల్లో జరిగే క్రియల గురించి తెలియజేశారు. బ్యాటరీలను తయారు చేసే విధానాలపై వీడియోలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. సిద్ధార్థ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి కేఎస్వీ సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో పుస్తకాల్లో చదివిన పాఠాల కంటే ఇలాంటి వర్క్‌షాప్‌లతో ఎంతో అవగాహన పెరుగుతుందన్నారు. సదస్సు అనంతరం రవీంద్ర విద్యార్థుల సందేహాలను తీర్చారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్. అధ్యాపకులు, విద్యార్థులు రవీంద్రను సత్కరించారు.

తప్పకుండా హెల్మెట్ ధరించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ద్విచక్ర వాహనచోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ డీసీపీ ఎం. కృష్ణమూర్తి నాయుడు సూచించారు. గురువారం సూర్యారావుపేటలోని శ్రీధర్ సీసీఈలో రోడ్డు ప్రమాదాల నివారణకు 'రహదారి భద్రతపై' ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టిలోని అన్ని జీవులకు ప్రాణం ఎంతో విలువైందన్నారు. ప్రాణాన్ని కాపాడుకునేందుకు వాహనచోదకులు హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వేగ పరిమితిని అనుసరించి, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ ఎస్.ఆర్. వంశీధర్ గౌడ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల ప్రధాన కారణం ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించడమేనన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు గౌరవించాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వాడటం ప్రమాదకరమన్నారు. అనంతరం అతిథులను శ్రీధర్ సీసీఈ డైరెక్టర్ కొమ్మూరి శ్రీధర్ సత్కరించించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వి. జానకిరామయ్య , సీసీఈ డైరెక్టర్ సీతారామిరెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న పోలీస్ అధికారులు

రంజాన్ మాసం పరమ పవిత్రం

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): రంజాన్ మాసం పరమ పవిత్రమని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా గురువారం సాయంత్రం వన్‌టౌన్ వించిపేట షాహీ మసీదు వద్ద ఉన్న మంత్రి స్నేహితుడు యూసుఫ్ నివాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో చేసే పుణ్యకార్యాలు అధిక ఫలాలు ఇస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ అల్లా మార్గంలో పయనిస్తూ ఎదుటివారి పట్ల జాలి, దయ, కరుణ, ప్రేమను కలిగి ఉండాలని సూచించారు. నాయకులు యూసుఫ్, కములు, అక్బర్, అన్వర్ పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందు స్వీకరిస్తున్న మంత్రి సుభాష్